వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

- కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయంపై ఆందోళన
- కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- భారీ ర్యాలీతో వైద్య కళాశాల వద్ద నిరసన


కామనగరువులోని వైద్య కళాశాల వద్దకు ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

అమలాపురం రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ అమలాపురం మండలం కామనగరువులో వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం కదంతొక్కాయి. రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అమలాపురం రూరల్ మండలం కామనగరువులో గత ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది.చలో కామనగరవు పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చంద్రబాబు డౌన్ డౌన్, మోసకారి బాబు- మాకొద్దు బాబోయ్, ఇదేమి రాజ్యం- దొంగల రాజ్యం తదితర నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది.

వైద్య కళాశాల వరకూ ర్యాలీ

తొలుత కామనగరువు గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపూడి మురళీకృష్ణ నివాసాల వద్ద నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వైద్య కళాశాల వద్ద వరకూ ర్యాలీ నిర్వహించారు. బడుగువాని పేట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు వైద్య కళాశాల వద్దకు చేరుకుని భవనాలను పరిశీలించి నిరసన తెలిపారు. వైద్య కళాశాల భవనాలను నిర్మించినా కూటమి నాయకులకు కంటికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

గజమాలతో సత్కారం

ఈ సందర్భంగా వైద్య కళాశాల వద్ద నిరసన కార్యక్రమం విజయవంతం చేసినందుకు రాజులపూడి భాస్కరావు, రాజులపూడి మురళీకృష్ణను పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, పార్టీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ గజమాలతో సత్కరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవిరావు, కొనుకు బాపూజీ, విత్తనాల శేఖర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాలమూరి బాలకృష్ణ, పార్టీ అనుబంధ కమిటీల నాయకులు పొగాకు శ్రీను, దూడల ఫణి, కముజు రమణ, సరెళ్ల రామకృష్ణ, ఉండ్రు వెంకటేష్, కుడుపూడి భరత్ భూషణ్, దొమ్మేటి రాము, కుడుపూడి బాబు, పెట్టా అప్పారావు, కాట్రు ధనలక్ష్మి, ఓగూరి విజయ్‌కుమార్, సలాది సతీష్, ములపర్తి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, బడుగు త్రిమూర్తులు, మెండు ప్రసాద్, నక్కా సంపత్‌కుమార్, సర్పంచ్‌లు పొనకల గణేష్, పెయ్యల రాజకుమార్, చెల్లుబోయిన నాని, గుమ్మళ్ల సురేష్, మొసలి స్వర్ణనరాజు, కర్రెళ్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.


కామనగరవులో భాస్కరరావు, మురళీకృష్ణను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి తదితరులు

వీఏఓ పరీక్ష నిర్వహణ సిబ్బందికి శిక్షణ

యానాం: పుదుచ్చేరి రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (వీఏఓ) పోస్టుల భర్తీకి ఈనెల 21న నిర్వహించే రాత పరీక్షకు సంబంధించి ఇన్విజిలేటర్లకు, పర్యవేక్షకులకు స్థానిక కాన్ఫరెన్స్‌హాలులో శుక్రవారం ఆర్ఏఓ, ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష ఓఎంఆర్ షీటు, వివిధ సెట్ల ప్రశ్నా పత్రాలు అభ్యర్థులకు పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పుదుచ్చేరి ప్రభుత్వ అండర్ సెక్రటరీ మురుగేషన్ వివరించారు. యానాం పట్టణంలో 6 పరీక్షా కేంద్రాలను వీఏఓ ఉద్యోగ రాత పరీక్షకు ఏర్పాటు చేసినట్లు ఆర్ఏఓ తెలిపారు.ఈ పరీక్షకు సుమారు 1,900 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. రీజెన్సీ స్కూల్, జూనియర్ కళాశాల, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ స్కూల్, ఎంజీజీబీహెచ్ స్కూల్, ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల, ఎస్‌టీపీపీ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష రెండుపూటలా జరుగుతుందని ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష పర్యవేక్షణాధికారిగా పుదుచ్చేరి నుంచి ఐఏఎస్ అధికారి యాసిన్‌చౌదరి బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు.

దసరాను ప్రశాంతంగా జరుపుకోండి

అమలాపురం టౌన్: వచ్చే దసరా ఉత్సవాలను, ఊరేగింపులను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణంలోని గండువీధి ప్రజలకు పట్టణ సీఐ పి.వీరబాబు సూచించారు. గండువీధి శేష శయన ఉత్సవ కమిటీ చెడీ తాలింఖానా ముందస్తు ప్రదర్శనలకు గురువారం రాత్రి హాజరైన సీఐ వీరబాబు అక్కడ ఉత్సవ నిర్వాహకులు, ప్రజలతో చర్చించారు. అమలాపురంలో అక్టోబర్ 2న నిర్వహించనున్న దసరా ఉత్సవాలు, ఊరేగింపు కార్యక్రమాల్లో 7 వీధులకు సంబంధించి గండువీధి వాహనం పాల్గొని చెడీ తాలింఖానా ప్రదర్శన ఉంటుంది. సీఐ వీరబాబు, పట్టణ ఎస్సైలు ఎస్ఆర్ కిషోర్‌బాబు, టి.శ్రీనివాస్ పాల్గొని ఊరేగింపును ప్రశాంతంగా నిర్వహించుకునేలా గండువీధి కమిటీ పెద్దలతో మాట్లాడారు. ఆ వీధి ఆయుధ పూజలో పాల్గొన్న సీఐ, ఎస్సైలు కొద్దిసేపు వీధి ఉత్సవ కమిటీ ప్రతినిధులు నిర్వహించిన చెడీ తాలింఖాన ప్రదర్శనలను తిలకించారు. ఉత్సవ కమిటీ పెద్దలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మామిడిపల్లి రాము పాల్గొన్నారు.


గండువీధి చెడీ తాలింఖానా ఉత్సవ కమిటీ ఆయుధ పూజలో పాల్గొన్న పట్టణ సీఐ వీరబాబు, ఎస్సైలు

నాలుగు సంస్కరణ బిల్లుల ఆమోదం

యానాం: పుదుచ్చేరిని పెట్టుబడులకు అత్యంత పోటీతత్వం, ప్రాధాన్యతగల గమ్యస్థానాల్లో ఒకటిగా మార్చే లక్ష్యంతో శుక్రవారం శాసనసభ నాలుగు ముఖ్యమైన సంస్కరణల బిల్లులను ఆమోదించింది. ఈ సందర్భంగా 2025 పుదుచ్చేరి ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు, టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ చట్టానికి సవరణలు, పుదుచ్చేరి మున్సిపాలిటీ చట్టం, కమ్యూన్ పంచాయతీ చట్టం తదితర అంశాలను సవరణలతో పాటు భారాలను తగ్గించడం, లైసెన్సింగ్ ప్రక్రియలను సరళీకృతం చేయడం, పట్టణ పాలనను బలోపేతం చేయడంపై ఈ బిల్లులను ఆమోదించారు. వ్యాపారం సులభతరం బిల్లులో పరిశ్రమలకు, వ్యాపారాలు, వాణిజ్య సంస్థలకు వేగవంతమైన అనుమతులిచ్చేలా చర్యలు తీసుకున్నారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ చట్టానికి చేసిన సవరణ భూవినియోగాన్ని మార్చడానికి క్లిష్టమైన విధానాన్ని సులభతరం చేసేలా రూపొందించారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

ముమ్మిడివరం: ముమ్మిడివరం సబ్ రిజిష్టర్ పరిధిలోని దస్తావేజుల లేఖర్లు శుక్రవారం పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలియజేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోప భూయిష్టమైన 2.0 విధానం వల్ల ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు విపరీతమైన అసౌకర్యం కలుగుతుందన్నారు. ఓటీపీల విధానం అమల్లోకి రావడంతో రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు, చేసేవారు కూడా ఓటీపీలు బహిర్గతం చేయడానికి వెనకాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విధానం వల్ల ఏర్పడే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ముమ్మిడివరం దస్తావేజు లేఖర్లు కలసి వారి సంఘం ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈకార్యక్రమంలో మంత్రి ప్రగడ వెంకట కృష్ణారావు, త్సవట పల్లి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద

ఐ.పోలవరం: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలు, కక్షిదారుల ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఆరోపిస్తూ పెన్‌డౌన్ ద్వారా దస్తావేజు లేఖర్లు నిరసన తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రెండు రోజులపాటు నిరసనలో శుక్రవారం పెన్‌డౌన్‌లో పాల్గొన్నామని దస్తావేజు లేఖర్లు తెలిపారు. శనివారం జిల్లా రిజిస్ట్రార్, కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పిస్తామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జి.శ్యామలరావు, సిహెచ్.త్రిమూర్తులు, హరీష్, శర్మ పాల్గొన్నారు.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న దస్తావేజు లేఖర్లు

మునికుమారికి ఘన సన్మానం

కాట్రేనికోన: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధిగా కాశి మునికుమారికి నియమించడంతో పల్లంకుర్రు వైఎస్సార్ సీపీ నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ ఉన్నతి కోసం పని చేస్తున్న మునమ్మ సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి మహిళా విభాగం బాధ్యతలు అప్పగించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న తనపై పెట్టి బాధ్యతలను, పార్టీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. పార్టీ నాయకులు సాపే సూర్య ప్రకాష్, ఎంపీటీసీలు గిడ్డి తిరుపతి వెంకటేశ్వర రావు, చీకురుమిల్లి రత్న ప్రసాద్,జనిపెల్లి శ్రీనివాస రావు,ఎలిపే భీమరాజు, ఎలిపే నాగరాజు, కాశి రమేష్ బాబు,ముంగండ గంగన్న, నాగరాజు, కిరణ్ కుమార్ ఉన్నారు.


కాశి మునికుమారిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

21న రామానుజన్ టాలెంట్ టెస్ట్

యానాం: విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తి, సృజనాత్మకశక్తిని పెంపొందిచేందుకు ఈనెల 21న ఆదివారం యానాం పబ్లిక్ స్కూల్లో గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాసరామానుజన్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం కోఆర్డినేటర్ ఆనాల వీరభద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రిలిమినరీ పరీక్ష, ఫైనల్ పరీక్ష నవంబర్ 16న నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రసంశాపత్రాలు ఇస్తారన్నారు. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ఆసక్తిగల విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్ హాజరుకావచ్చని వివరాలకు 9573511104 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

ఎస్పీని కలిసిన చాంబర్ వ్యాపారులు


ఎస్పీ రాహుల్ మీనాను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ మీనాను అమలాపురం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చాంబర్ ముఖ్య సలహాదారు కంచిపల్లి అబ్బులు, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, ఉపాధ్యక్షుడు మోకా వెంకట సుబ్బారావు, డైరెక్టర్లు నమ్మిన వీరబాబు, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, రాయుడు నాని, గోకరకొండ ప్రసాద్ తదితరులు ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు.

పనికి తగిన వేతనం అందించాలి

ఉప్పలగుప్తం: సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమాన పనికి, సమాన వేతనాన్ని అందించాలని సర్వ శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల విద్యా శాఖ కార్యాలయం ఎదట కొన్ని డిమాండ్లతో నిరసన తెలియజేశారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు భద్రత కల్పించకుండా తాత్సారం చేస్తోందని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన కోరికలు తీర్చాలని సమ్మె కాలపు ఒప్పందాలు నెరవేర్చాలని వారు కోరారు. ప్రభుత్వ ఎస్ఎస్ఏ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దశలవారీగా ఉద్యమాన్ని ఉధృత్తం చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 12న ఎంబీవీకే విజ్ఞాన్ కేంద్రం విజయవాడలో (దశాబ్ద ఉద్యమం - భవిష్యత్ పోరాటం) నినాదంతో మహాసభ నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.గంగాధర్ రావు, జె.అశోక్ బాబు, బి.జాన్ బాబు, ఎమ్.లలిత, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఉప్పలగుప్తంలో విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సర్వ శిక్ష ఉద్యోగులు

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

యానాం: రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 21నుంచి భీమవరంలో నిర్వహిస్తున్నారని శుక్రవారం యానాం బాడీబిల్డింగ్ అసోషియేషన్ కార్యదర్శి యాళ్ల జీవన్ ప్రభాకర్ తెలిపారు. భీమవరం డాక్టర్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న ఈ పోటీలు న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. యానాం పరిసర ప్రాంతాల నుంచి సైతం పలువురు బాడీబిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ పెందెం సూర్యప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయుడు గుత్తుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల పాత్ర కీలకం

అమలాపురం రూరల్: సమాజాభివృద్ధికి, ఆర్థిక ప్రగతికి బ్యాంకింగ్ సేవలు అందించడంలో అధికారుల సమన్వయంతో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సంప్రదింపుల కమిటీ, జిల్లాస్థాయి రివ్యూ కమిటీ సమావేశాలకు కలెక్టర్ అధ్యక్షతన ఎల్‌డీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణాల మంజూరు లక్ష్యాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తాహసీల్దార్లు, ఉప తాసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి పలు అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ టి.నిశాంతి, డీఆర్ఓ కే. మాధవి ఆర్డీఓలు పి శ్రీకర్ డి.అఖిల పాల్గొన్నారు

రొయ్యల సాగులో తెగుళ్ల నివారణకు చర్యలు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో సుమారు 70 వేలు ఎకరాలలో తెగుళ్లు సోకి రొయ్యల పంట దెబ్బ తిన్న సంఘటనపై కలెక్టర్ ఆరా తీశారు. కాకినాడ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్, అదనపు సంచాలకులు ఎస్ అంజలి, మత్స్యశాఖ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ వ్యాధిని నివారణకు మత్స్యశాఖ అధి కారులు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి పీవీ శ్రీనివాస రావు, సహాయ సంచాలకులు వర్ధన్, సైంటిస్టులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పదోన్నతి కల్పించాలని వీఆర్ఏల ధర్నా

తాళ్లరేవు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు రెండు రోజులపాటు ధర్నా నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. పేస్కేల్ అమలు చేయాలని, అర్హులకు వీఆర్ఓ అటెండర్, వాచ్‌మెన్లుగా ప్రమోషన్లు కల్పించాలని, నామినీ వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో యండమూరి శేషయ్య, మడికి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరంలో..

అల్లవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు చేపట్టిన నిరసన రెండో రోజుకు చేరింది. అల్లవరం గ్రామ రెవెన్యూ సహాయకుల యూనియన్ అధ్యక్షుడు మోకా సత్యనారాయణ ఆధ్వర్యంలో వీఆర్ఏలు మాట్లాడుతూ సమస్యలపై కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావుకి వినతపత్రాన్ని అందించారు. వీఆర్ఏలు మాకే శ్రీను, వాడపర్తి దుర్గారావు, శ్రీదేవి, సంతోష్, సాయి పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకారం

అమలాపురం రూరల్: ఉద్యోగుల విధుల నిర్వహణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అన్ని విధాల సహకారం అందిస్తానని జిల్లా జాయింట్ టి. నిషాంతి రెవెన్యూ పౌర సరఫరాల ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ చాంబర్‌లో నిర్వహించిన రెవెన్యూ కేర్ ఓపెన్ హౌస్ గ్రీవెన్స్‌లో సుమారు ఆరుగురు ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రాన్ని జేసీకి అందించారు. ఇంటింటి సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృ శాఖలకు అప్పగించాలని కోరారు. వీఆర్ఏలు పదోన్నతి ఇవ్వాలని కోరారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

అల్లవరం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్ స్పందన అన్నారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ మహిళలు తరుచుగా బీపీ, సుగర్, రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి రోజు ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దొమ్మేటి శ్రీశాంతి భవాని, ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఆదిశంకరం, గ్రేడ్-5 కార్యదర్శి బాబ్జి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన మహిళలే కుటుంబ బలం

ముమ్మిడివరం: ఆరోగ్యకమైన మహిళలే కుటుంబానికి మరింత బలమని నగరపంచాయతీ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన స్వస్థ్ నారి- సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు డి.వెంకటేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కట్టా సత్తిబాబు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వస్థలానికి చేరిన కువైట్ బాధిత మహిళ

అమలాపురం రూరల్: ఉపాధికోసం కువైట్‌కు వెళ్లి నకిలీ ఏజెంట్ చేతిలో మోసపోయి రెండు నెలల 20 రోజుల పాటు తీవ్ర పని ఒత్తిడికి గురై అనారోగ్యం బారినపడి ఇబ్బందులు పడుతున్న మామిడికుదురు మండలం ముత్యాలపాలెంకు చెందిన కొండేపూడి శ్రీదేవిని సురక్షితంగా స్వగృహానికి తీసుకువచ్చినట్టు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ (కేసీఎం) నోడల్ అధికారి కె.మాధవి శుక్రవారం తెలిపారు. నకిలీ ఏజెంట్ ద్వారా మోసపోయి కువైట్‌లో ఇబ్బందులు పడుతున్నట్టు తన భర్త కొండేపూడి శ్రీనివాసరావుకు తెలపడంతో ఆయన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ఆశ్రయించారు.దీనిపై స్పందించిన కలెక్టర్ మహేష్‌కుమార్ ఆమెను స్వదేశానికి తీసురావడానికి తగిన ఏర్పాట్లు చేయాలని కేసీఎం బృందాన్ని ఆదేశించారు. కేసీఎం బృందం ప్రవాస భారతీయ సహాయక కేంద్రం, విదేశీ రాయబార కార్యాలయాలను సంప్రదించడంతో వారు స్పందించి ఆమెను ఇండియాకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆమె స్వదేశానికి క్షేమంగా చేరిందని కేసీఏం సమన్వయకర్త గోళ్ల రమేష్ తెలిపారు. తన భార్యతో కలిసి కొండేపూడి శ్రీనివాసరావు జిల్లా రెవెన్యూ అధికారి మాధవిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. డీఆర్వో మాట్లాడుతూ విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేసి కుటుంబాలను పోషించుకోదలచిన వారు ఖచ్చితంగా కేసీఎం సెంటర్‌ను సంప్రదిస్తే మార్గ నిర్దేశం చేస్తామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

తాళ్లరేవు: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకృష్ణకు ఓఎన్‌జీసీ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సర్పంచ్‌కు అందజేశారు. ఓఎన్‌జీసీ ప్లాంటు పి.మల్లవరం పంచాయతీలో ఉన్నప్పటికీ పంచాయతీని అభివృద్ధి చేయడంలేదని, గ్రామ యువతకు ఉద్యోగాలు కల్పించడం లేదని వారు వాపోయారు. పదేళ్లుగా పనిచేస్తున్నా తమకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. ఈ కార్యక్రమంలో కె.భీమ్‌జీ, ఎ.శ్రీనివాస్, పి.సూర్యచంద్ర, డి.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ శిక్షణ పూర్తిచేసిన ఎస్ఎస్‌కేబీఆర్ విద్యార్థి

అమలాపురం రూరల్: దేశ రక్షణ విభాగానికి సంబంధించి ఆర్మీ విభాగంలో నిర్వహించే సైనిక్ శిబిరంలో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థి పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ వడలి సుబ్బారావు తెలిపారు. తమ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మూడవ ఏడాది చదువుతున్న జావేద్ హుస్సేన్ న్యూఢిల్లీలో ఈ నెలలో నిర్వహించిన క్యాంప్‌లో పాల్గొని విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకోవడం గర్వకారణమన్నారు. కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ అధికారి కెప్టెన్ డాక్టర్ ఏవీవీ శర్మ మాట్లాడుతూ కళాశాలలోని ఆర్మీ విభాగంలో సీనియర్ అండర్ ఆఫీసర్‌గా జావేద్ వ్యవహరిస్తున్నాడన్నారు. జావేద్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, కోశాధికారి డీఎస్.ఎన్ రాజు, పరిపాలనాధికారి ఎ.వెంకటపతి రాజు అభినందించారు.


జావేద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్బరాజు

క్లుప్తంగా

'భీమన్న' పురస్కారాలకు నల్లా, బీవీవీ ఎంపిక


నల్లా నరసింహమూర్తి


బీవీవీ సత్యనారాయణ

అమలాపురం టౌన్: డాక్టర్ బోయి భీమన్న విశిష్ట సాహితీ అవార్డులకు అమలాపురానికి చెందిన కవులు, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని భీమన్న సాహితీ నిధి ట్రస్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చైర్‌పర్సన్, కవయిత్రి డాక్టర్ బోయి హైమావతి వెల్లడించారు. అవార్డులకు ఎంపికైన నరసింహమూర్తి, సత్యనారాయణ 40 ఏళ్లుగా అమలాపురం వేదికగా పలు సాహితీ కార్యక్రమాలు, కవితా గోష్ఠులు నిర్వహిస్తూ సాహిత్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీరు అమలాపురం జంట కవులుగా ప్రసిద్ధి చెందారని అన్నారు. డాక్టర్ బోయి హైమావతి చేతుల మీదుగా అమలాపురంలో శనివారం కవులు నరసింహమూర్తి, సత్యనారాయణ అవార్డులు అందుకోనున్నారు.

మెట్ల రామ్మూర్తి సొసైటీలో మహాజన సభ

అల్లవరం: కొమరగిరిపట్నం మెట్ల రామ్మూర్తి సహకార చైర్మన్ మెట్ల రమణబాబు అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది సొసైటీ సాధించిన విజయాలు, జమా ఖర్చులను చైర్మన్ ఖాతాదారులకు వివరించారు. ప్రస్తుతం సొసైటీ రూ.15 కోట్ల టర్నోవర్‌తో లావాదేవీలు సాగుతూ లాభాల బాటలో ముందుకు వెళుతోందని రమణబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడలి శ్రీనివాస్, బళ్ల సత్యనారాయణ, గునిశెట్టి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ముమ్మిడివరం: చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ల మరమ్మతుల కోసం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఈఈ కే రాంబాబు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానానికి ఓ భక్తుడు విరాళం అందజేశారు. విశాఖపట్టణానికి చెందిన గుండు వాణీ రమాకాంత శర్మ రూ.10,110 శుక్రవారం విరాళంగా అందించారు. ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేక దర్శనం అందించారు. స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. దేవస్థానం సహాయ కమిషనర్, ఈవో వి.సత్యనారాయణ అభినందనలు తెలియజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఉప్పలగుప్తం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ విద్యార్థులకు సూచించారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జి.కనకదుర్గ ఆధ్వర్యంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్, క్రీడలు పోటీల ప్రారంభోత్సవానికి ఎంఈఓ ఎస్.సత్యకృష్ణ, సర్పంచ్ శ్రీ దుర్గ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్ 17 బాలుర విభాగంలో గొల్లవిల్లి జట్టు విజేతగా, భీమనపల్లి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. కబడ్డీలో భీమనపల్లి జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎం సత్యనారాయణ, మంచిగంటి వెంకట సుబ్బారావు, ఎస్ఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి కృషి

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీకి తొలి మహిళా సభ్యురాలుగా అమలాపురం మండలం భట్నవిల్లికి చెందిన మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పుణ్యమంతుల రజనిని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ నియమించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి నూతన బాధ్యతలు అప్పగించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని ఆమె అన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు

తాళ్లరేవు: రసాయనాలు వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా చేసే ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరుగుతుందని, ఆ విధంగా పండించిన పంటను తినడం ద్వారా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రకృతి వ్యవసాయ క్షేత్రం రైతు ధూళిపూడి వెంకటరమణ అన్నారు. శుక్రవారం పి.మల్లవరం పంచాయతీలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆరవ వారం మండల ఏఓ ఎస్.ప్రశాంతి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో ఆకుముడత పురుగు నివారణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా కృషి అమృత్ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వెంకటరమణ వివరించారు. సర్పంచ్ పంపన రామకృష్ణ, రైతులు దడాల బుజ్జిబాబు, ఉంగరాల బూరిబాబు, మద్దింశెట్టి బద్రి, దడాల సత్తికొండ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.